
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 11 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 36.897 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 93.406 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,770
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,547
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,713
సవర (8 గ్రా) -	రూ.45,704

వాతావరణం
గరిష్టం/కనిష్టం 41.6 /32.1

శనివారం గాలిలో తేమ 33 శాతం ఉంది. ఆదివారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఫైనల్ సీనియారిటీ జాబితా విడుదల
నెల్లూరు(టౌన్): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది రిక్వెస్ట్ రీప్లేస్‌మెంట్‌కు సంబంధించి ఫైనల్ సీనియారిటీ లిస్టును సమగ్ర శిక్ష కార్యాలయంలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ సీనియారిటీ లిస్టులో పేర్లు ఉన్న వారు ఈ నెల 12న సమగ్ర శిక్ష కార్యాలయంలో 3 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పో ప్రారంభం



రుణం అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరులోని కెనరా బ్యాంక్ రీజనల్ కార్యాలయం వద్ద శనివారం మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పోను శనివారం ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పోలో సుమారు రూ.4 కోట్ల మేర విద్య, గృహ నిర్మాణ, కారు, మార్టిగేజ్ రుణాలను తక్షణం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పో ఆదివారం కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్ల కొనుగోలు, విద్య, గృహ నిర్మాణాలకు రుణాలు అవసరమైన వారు కెనరా బ్యాంక్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ రామ్‌కుమార్, బ్యాంక్ రీజనల్ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని కెనరా బ్యాంక్ శాఖల మేనేజర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

బైక్, ఆర్టీసీ బస్సు ఢీ
- విద్యార్థి మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు


ఇమ్రాన్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని చంద్రపడియ సమీపంలో గోకులవనం వద్ద శనివారం రాత్రి బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చంద్రపడియకు చెందిన చెరుకూరు ఇమ్రాన్(16), చందు, కేశవ స్నేహితులు. వీరు ముగ్గురూ వింజమూరులో పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరారు. గోకులవనం వద్ద ఆత్మకూరు నుంచి వింజమూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొంది. చందు, కేశవలకు కాళ్లు, చేతులు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇమ్రాన్‌ను వింజమూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్సై కోటిరెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇమ్రాన్ ఇటీవల పదో తరగతి పాసయ్యాడు. ఇంటర్‌లో చేరాల్సి ఉంది. కుమారుడి మృతితో ఇమ్రాన్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మరో రెండు చోట్ల..

మండలంలోని మాధవనగర్ వద్ద రెండు బైక్‌లు ఢీకొట్టిన ఘటనలో జనార్దనపురానికి చెందిన స్వర్ణ మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వరికుంటపాడు మండలం గణేశ్వరపురానికి చెందిన మరో వ్యక్తికి కూడా గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

పొగాకుకు రికార్డు ధరలు
కందుకూరు: పొగాకు వేలంలో రికార్డు ధరలు నమోదవుతూనే ఉన్నాయి. వరుసగా రెండో రోజు రికార్డు స్థాయిలో ధరలు పలికాయి. శనివారం వేలంలో ఏకంగా కేజీ పొగాకు ధర రూ.242 పలికింది. కందుకూరు–1 వేలం కేంద్రంలో 578 బేళ్లు వేలానికి ఉంచగా 518 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 834 బేళ్లు ఉంచగా 747 బేళ్లు అమ్ముడుపోయాయి. ఒకటో వేలం కేంద్రంలో అత్యధిక ధర రూ.242 రాగా, రెండో వేలం కేంద్రంలో రూ.240 పలికింది.

స్కూళ్లు కొత్త కొత్తగా..

నాడు-నేడుతో సర్కారు బడులను తీర్చిదిద్దిన ప్రభుత్వం
- కార్పొరేట్‌కు దీటుగా వసతుల కల్పన
- అదనపు గదులు, ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణం
- ‘నాడు-నేడు’లో రాష్ట్రంలో ప్రథమ స్థానం
- రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

నెల్లూరు(టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థుల అభ్యున్నతికి అనేక పథకాలను అమలు చేస్తోంది. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. సర్కారు బడుల్లో నాడు–నేడు కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించారు. అదనపు తరగతి గదులు, ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు విద్యార్థులకు అనువుగా బల్లలు, గ్రీన్ చాక్‌బోర్డులు, ప్రహరీలపై పలు రకాల బొమ్మలు, గార్డెనింగ్, ఆటస్థలాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండడంతో చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

నాడు–నేడు తొలి విడతలో భాగంగా జిల్లాలో రూ.283.50 కోట్లతో 1,059 ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. రెండో విడతలో రూ.478.12 కోట్లతో 1,354 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కాగా ‘నాడు–నేడు’ పనుల్లో మన జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల్లో తరగతి గదులకు మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించారు.

64 శాతానికి పైగా పనులు పూర్తి

జిల్లాలో ‘నాడు–నేడు’ రెండో విడత పనులు ఆయా పాఠశాలల్లో 64.1 శాతం పూర్తయ్యాయి. రెండో విడత అభివృద్ధి పనులకు 864 ప్రాథమిక, 136 ప్రాథమికోన్నత, 247 ఉన్నత పాఠశాలలు, 108 అంగన్‌వాడీ కేంద్రాలు, 22 జూనియర్ కళాశాలలు, ఒక డైట్ కళాశాల, ఒక బీఈడీ కళాశాల ఎంపికయ్యాయి. వీటిలో మౌలిక వసతులు కల్పించడానికి మొత్తం రూ.478.12 కోట్ల నిధులు వ్యయం చేయాల్సి ఉంటుందని అంచనాలు సిద్ధం చేశారు.



గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి బాటపట్టిన కోవూరుపల్లి పాఠశాల



ప్రభుత్వ బడులు అభివృద్ధికి ఆనవాళ్లుగా నిలిచాయి. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ స్కూళ్లలో లేని వసతులను కూడా సర్కారు బడుల్లో ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దింది. బోధనా సౌకర్యాలను సైతం మెరుగుపరిచింది. దీంతో విద్యార్థులు ఎంతో సౌకర్యవంతంగా చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.



గతంలో మరుగుదొడ్ల దుస్థితి.. ఇప్పటి పరిస్థితి



స్మార్ట్ టీవీకి ఇరువైపులా ఉన్న గ్రీన్ చాక్‌బోర్డులు

ఇప్పటి వరకు రూ.161.70 కోట్లు ఖర్చు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ప్రహరీలు, బల్లలు, కుర్చీలు, డెస్కులు, రన్నింగ్ వాటర్, గ్రీన్ చాక్‌బోర్డులు, ఇంగ్లిష ల్యాబ్, లైట్లు, ఫ్యాన్లు, బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. రెండో విడత పనుల్లో జిల్లాలోని 542 పాఠశాలల్లో 1,985 అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. వీటితోపాటు 335 ప్రహరీలు, 840 మరుగుదొడ్లు, 208 కిచెన్ షెడ్లు, 774 తరగతి గదులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు 901 పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 63 కిచెన్ షెడ్లు నిర్మించారు. పలు పాఠశాలల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి.

జిల్లాలో..

నాడు-నేడు తొలి విడతలో	
అభివృద్ధి చేసిన పాఠశాలలు - 1,059	వినియోగించిన నిధులు - రూ.283.50 కోట్లు
రెండో విడతలో	
పనులు జరుగుతున్న పాఠశాలలు, కళాశాలలు - 1,354	
ఖర్చు చేస్తున్న నిధులు - రూ.478.12 కోట్లు	
నిర్మించిన అదనపు తరగతి గదులు - 1,985	

423 పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ఏర్పాటు

జిల్లాలోని 423 ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్‌ట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. 234 హైస్కూల్స్‌లో 1,324 ఐఎఫ్‌పీ ప్యానెల్స్, 189 ప్రాథమిక పాఠశాలల్లో 428 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. స్మార్ట్ టీవీకి ఇరువైపులా గ్రీన్ చాక్‌బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. ఈ పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. వీటి ద్వారా ఉపాధ్యాయులు అత్యాధునిక పద్ధతుల్లో ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠాలు బోధించనున్నారు.



మిగిలిన పనులు త్వరలో పూర్తి చేస్తాం



‘నాడు–నేడు’ రెండో విడతలో ఎంపికైన పాఠశాలల్లో మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరలో పూర్తి చేస్తాం. ప్రస్తుతం విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని పాఠశాలల్లో రిపేర్లు, సౌకర్యాలను పూర్తి చేశాం. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలను కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ ప్రతి రోజూ నాడు–నేడు పనులపై మానిటరింగ్ చేస్తున్నారు.

– ఉషారాణి, ఏపీసీ, సమగ్ర శిక్ష

మౌలిక వసతులు కల్పించారు



పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేని అన్ని సౌకర్యాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారు. తరగతి గదులు, ఆర్వో ప్లాంట్లు, బల్లలు, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేశారు. విద్యాబోధన కూడా బాగుంది. ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉన్నారు.

– జీవీ ప్రసాద్, విద్యార్థి తండ్రి

ఆద్యంతం.. భవ్యశోభితం

- అరుణాచలేశ్వరంలో భవ్యహాసిని నాట్యప్రదర్శనకు శ్రీకారం
- నాట్యంతో గిరి ప్రదక్షిణ చేసేందుకు సమాయత్తం



శబరి శ్రీరామక్షేత్రంలో భవ్యహాసిని నృత్యప్రదర్శన

నెల్లూరు(బృందావనం): సింహపురి చిన్నారి, నగరంలోని నవాబుపేటకు చెందిన నల్లంగు భవ్యహాసిని తన నాట్యప్రదర్శనతో మరో సాహసానికి పూనుకుంది. గత నెలలో కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రానికి అలిపిరి నుంచి తన నాట్యప్రదర్శనతో వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అదే స్ఫూర్తితో ఈ పర్యాయం పరమేశ్వరుడు కొలువైన తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలై(అరుణాచలం)లో గిరిప్రదక్షిణను ఈ ఏడాది జూలై 16వ తేదీన నిర్వహించేందుకు సమాయత్తమైంది. ఈ నాట్యప్రదర్శన ఒక్క నిమిషం కూడా ఆగకుండా 5 గంటలపాటు 14 కిలోమీటర్లు నిర్వహించేలా భవ్యహాసిని నిర్ణయించింది. ఆ మహాసంకల్పం సిద్ధించాలని నగరంలోని 6 ఆలయాల్లో మూడేసి గంటల చొప్పున నిర్విరామ నాట్యప్రదర్శన ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలుత రాంనగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో శనివారం మూడు గంటలపాటు ఆమె నాట్యప్రదర్శన ఇచ్చారు. ఈ మహాసంకల్పం నెరవేరాలని శబరి శ్రీరామక్షేత్రం నిర్వాహకులు సుబ్బరాజు, చంద్రారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు నరేష్‌స్వామి ఆమెను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భవ్యహాసిని తల్లిదండ్రులు చెంచులక్ష్మి – సునీల్‌కుమార్, నాట్యగురువులు కళాదీప్తి సుబ్రహ్మణ్యం, కామాక్షి మాట్లాడుతూ 7వ తరగతి చదువుతున్న భవ్యహాసిని గత ఆరేళ్లుగా ఎంతో కఠోర శిక్షణతో నాట్యసాధన చేసి నాట్యప్రదర్శనలు ఇస్తోందని తెలిపారు.

మేడపై నిద్రిస్తుండగా చోరీ

- రూ.1.80 లక్షల నగదు, 14 సవర్ల బంగారం అపహరణ



చోరీ వివరాలు తెలుసుకుంటున్న సీఐ రవినాయక్

సంగం: వేసవి నేపథ్యంలో కుటుంబసభ్యులు రాత్రి మేడపై నిద్రిస్తుండగా బీరువాలో దాచిన 14 సవర్ల బంగారం, రూ.1.80 లక్షల నగదు చోరీకి గురైంది. ఈ ఘటన మండల పరిధిలోని చెన్నవరప్పాడు గ్రామంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. చెన్నవరప్పాడుకు చెందిన బాలకొండయ్య శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంటి తలుపులకు తాళాలు వేసి భార్య, కుమారుడితో కలిసి మేడపై నిద్రించాడు. తెల్లవారుజామున 4.30 గంటలకు కిందికి రాగా తాళాలు తీసి గడియపెట్టి ఉంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరుచి ఉండడాన్ని గమనించాడు. అందులోని బంగారం, నగదు అపహరణకు గురైంది. అయితే లాకర్‌లోని పర్సులో ఉన్న రూ.70 వేల నగదు, కొంత బంగారం అలానే ఉంది. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి బాధితులతోపాటు గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.

సాగరంలో తమిళ జాలర్ల ఆగడాలు

- నిబంధనలను ధిక్కరించి ఆంధ్ర మత్స్యకారులపై దాడులు
- పట్టించుకోని గత పాలకులు
- సమస్యలపై స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తమిళనాడు అధికారులతో చర్చించాలని అధికారులకు ఆదేశాలు
- త్వరలో తమిళనాడు మత్స్యశాఖ అధికారులతో చర్చలు



ఆంధ్రా తీరంలో అక్రమంగా ప్రవేశించిన తమిళ జాలర్లు(ఫైల్)

తమిళనాడుకు చెందిన కొందరు మత్స్యకారులు మన రాష్ట్ర పరిధిలోని సముద్రతీరంలోకి ప్రవేశించి ఇక్కడి మత్స్యసంపదను దోచుకుంటున్నారు. కేంద్ర మత్స్యశాఖ నిబంధనలను ధిక్కరించి ఆంధ్రా మత్స్యకారులపై దాడులకు తెగబడుతున్నారు. విలువైన వలలను ధ్వంసం చేస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ దౌర్జన్యకాండకు చెక్ పెట్టేందుకు గత ప్రభుత్వాలు స్పందించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితులపై తమిళనాడు ప్రభుత్వంతో చర్చించేందుకు ప్రయత్నించింది. కరోనా కారణంగా చర్చలు రెండు దఫాలు వాయిదా పడడం, ఆ తర్వాత ఇలాంటి దాడులు జరగకపోవడంతో మిన్నకుండిపోయారు. తాజాగా తమిళనాడు జాలర్ల దాడులు చర్చలకు దారితీశాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కడలినే నమ్ముకుని సంప్రదాయ వలలతో ఆంధ్రా తీరంలోని తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల మత్స్యకారులు బతుకు పోరాటం చేస్తున్నారు. తమిళనాడులోని నాగపట్నం, కడలూరు, పుదుచ్చేరి సమీపంలోని కారైక్కల్ తీరప్రాంతాల నుంచి మత్స్యసంపద ఎగుమతి అవుతున్న క్రమంలో అక్కడి నుంచి కొందరు మత్స్యకారులు అత్యాధునిక బోట్లు, వలలతో వచ్చి ఇక్కడి మత్స్యసంపదను రెప్పపాటులో దోచుకుపోతున్నారు. అంతేకాక ఆంధ్రా మత్స్యకారులపై దాడులకు తెగబడుతున్నారు.

హద్దులు మీరి..

సముద్రంలో వేట సాగించడానికి కేంద్ర మత్స్యశాఖ కొన్ని నిబంధనలు విధించింది. సముద్ర తీరప్రాంత రాష్ట్రాల మధ్య సరిహద్దులు మీరకూడదనే ఆంక్షలు ఉన్నాయి. ఈ మేరకు సాధారణ తెప్పలు, బోట్లతో సముద్రతీరం నుంచి 8 కిలోమీటర్ల(5 నాటికల్ మైళ్ల) వరకు చేపల వేట చేసుకోవచ్చు. బోట్ల సామర్థ్యాన్ని బట్టి మరింత ముందుకు కూడా వెళ్లవచ్చు. ఇంజిన్ బోట్లు అయితే 23 కిలోమీటర్ల(12 నాటికల్ మైళ్ల) అవతలే వేట చేసుకోవాలి. అయితే తమిళ జాలర్లు అంతర్ రాష్ట్ర సరిహద్దులు దాటి వస్తున్నారు. నిబంధనల ప్రకారం తీరానికి 12 నాటికల్ మైళ్ల అవతల కాకుండా లోపలకు వచ్చి వేట సాగిస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మత్స్యకారులు వేట సాగించే చిన్న బోట్లు, తెప్పలను ఢీకొట్టి మరీ మత్స్యసంపదను దోచేస్తున్నారు.

కడలూరు బీచ్ టు సూర్యలంక

తమిళనాడు రాష్ట్రం కడలూరు బీచ్ నుంచి రాష్ట్రంలోని బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ వరకు సుమారు 160 నాటికల్ మైళ్ల దూరం ఉంది. తిరుపతి జిల్లా తడ నుంచి ప్రకాశం జిల్లా కొత్తపట్నం వరకు తమిళ మత్స్యకారులు దూసుకొస్తున్నారు. ప్రధానంగా తిరుపతి జిల్లా వాకాడు ప్రాంతం గోవిందరావు పట్టపుపాళెం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇస్కపల్లి పట్టపుపాళెం, రామాయపట్నం, చాకిచర్ల పట్టపుపాళెం, ప్రకాశం జిల్లాలోని ఊర్లపాళెం, పాకల పట్టపుపాళెం, టంగుటూరు మండలం తాళ్లపాళెం, కొత్తపట్నం బీచ్, మడనూరు ప్రాంతాల్లోనే తమిళ మత్స్యకారులు దాడులకు తెగబడుతున్నారు.



తమిళ జాలర్ల దాడిలో గాయపడిన యల్లంగారి శివాజీ(ఫైల్)

చర్చలకు యత్నాలు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. సముద్ర తీర ప్రాంత నిబంధనలు అతిక్రమించి చేపల వేట సాగిస్తున్న కడలూరు బోట్లను శాశ్వతంగా అడ్డుకుని సమస్య పరిష్కారానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. 2019, 2022 సంవత్సరాల్లో రెండు సార్లు మత్స్యశాఖ మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు సమావేశమయ్యేందుకు ప్రయత్నాలు చేశారు. కరోనా ఆంక్షల నేపథ్యంలో చర్చలు రెండు పర్యాయాలు రద్దయ్యాయి. మత్స్యకారుల సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జాలర్లకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశాలిచ్చారని ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తెలిపారు. రాష్ట్ర మంత్రి అప్పలరాజు, అధికారులు కలిసి తమిళనాడు అధికారులతో చర్చించారు. త్వరలోనే రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారని ఆయన తెలిపారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలు చూద్దాం రండి

• నేటి నుంచి ఐదురోజుల పాటు..

దుత్తలూరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన నర్రవాడలోని శ్రీవెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 15వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. మెట్టవాసుల కొంగు బంగారంగా.. సంతానలక్ష్మిగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు విశేషంగా హాజరు కానున్నారు. ఈ మేరకు అధికారులు, వ్యవస్థాపక ధర్మకర్తలు ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఉత్సవాల వివరాలు

తొలిరోజు 11న నిలుపు, పసుపు దంచే కార్యక్రమం, సంతానం లేనివారు వరపడుట ఉంటుంది. 12న రథోత్సవం, సంతానం లేనివారు వరపడుట, 13న రథోత్సవం, 14న పసుపు–కుంకుమ ఉత్సవం, వెంగమాంబ–గురవయ్య దంపతుల కల్యాణోత్సవం, రాత్రికి ప్రధాన రథోత్సవం, 15న పొంగళ్లు, రాష్ట్ర స్థాయి ఎడ్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అలాగే అమ్మవారి పుట్టినిల్లు వడ్డిపాళెంలో వెంగమాంబ ఇష్ట దైవమైన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి.



వెంగమాంబ-గురవయ్య దంపతులు

అమ్మవారి డబ్బులతో అధిక ఆదాయం

దేవస్థానం తరఫున అమ్మవారి నగదును భక్తులకు అందజేస్తారు. భక్తులు రూ.100 చెల్లిస్తే అమ్మవారి నగదును చిల్లర రూపంలో రూ.80 అందజేస్తారు. వీటిని పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేస్తే అధిక ఆదాయాలు వస్తాయనేది భక్తుల నమ్మకం.



వెంగమాంబ పేరంటాలు దేవస్థానం

నాలుగు పూరిగుడిసెలు దగ్ధం

• కట్టుబట్టలతో గిరిజన కుటుంబాలు

అనుమసముద్రంపేట : ప్రమాదవశాత్తు నాలుగు పూరిగుడిసెలు, ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైన ఘటన ఏఎస్‌పేట మండలంలోని పొనుగోడు గిరిజన కాలనీలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గిరిజన కుటుంబాలకు చెందిన పంజాపు పోలయ్య, మల్లిక మస్తానయ్య, మల్లిక వెంగయ్య, పంజాపు శంకరయ్య పక్కపక్కనే పూరిగుడిసెలు నిర్మించుకుని వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. రోజులానే శనివారం పనుల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లారు. అయితే మస్తానయ్య ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా అక్కడ వాహనం లేకపోవడంతో వింజమూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఇంతలో ఈదురు గాలులకు పక్కనున్న పూరిగుడిసెలకు సైతం మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో టీవీలు, ఫ్రిజ్‌లతో పాటు ఓ ద్విచక్ర వాహనం సైతం దగ్ధమైంది. దీంతో నాలుగు గిరిజన కుటుంబాలు కట్టుబట్టలతో వీధిన పడ్డాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఇన్‌చార్జి వీఆర్వో గణేష్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం తరఫున తక్షణ సాయం కింద 25 కిలోల బియ్యాన్ని గిరిజన కుటుంబాలకు అందజేశారు.



పూరిగుడిసెతో పాటు దగ్ధమైన ద్విచక్ర వాహనం

ఉన్నత విద్యతో ఉజ్వల భవిత



విద్యార్థికి కిట్‌ను అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

• రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవచ్చని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని వీపీఆర్ విద్య పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వీపీఆర్ ఫౌండేషన్ తరఫున ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి బ్యాగులు, పుస్తకాలు, షూస్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలనే ఆశయంతో వీపీఆర్ విద్య పేరుతో పాఠశాలను ప్రారంభించామని తెలిపారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి సంబంధించిన ఉన్నత చదువులకు తమవంతుగా సాయం అందిస్తామన్నారు.

గంపెడాశలు గల్లంతు

• పెన్నాలో గల్లంతైన యువకుల మృతదేహాల వెలికితీత
• మృతుల కుటుంబాల్లో తీరని విషాదం

నెల్లూరు రూరల్: ఆ యువకులు చదువులో ఉన్నతంగా రాణిస్తున్నారు. మరో ఏడాదిలో చదువులు పూర్తి చేసుకుని తమకు వెన్నుదన్నుగా నిలుస్తారని తల్లిదండ్రులు పెట్టుకున్న గంపెడాశలు గల్లంతయ్యాయి. రూరల్ పరిధిలో దేవరపాళెం సమీపంలోని పెన్నానది పాతబ్రిడ్జి వద్ద శుక్రవారం గల్లంతైన యుగేష్(21), సాయికిశోర్ (22) మృతదేహాలను శనివారం వెలికితీశారు. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు స్థానికంగా టిఫెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇతని రెండో కుమారుడైన యుగేష్ నగరంలోని వివేకానంద కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన విజయకుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని కుమారుడైన సాయికిశోర్ కొడవలూరు మండలంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. యుగేష్, సాయికిశోర్‌తో పాటు వెంగళరావు, ప్రణయాంక్‌రెడ్డి, అరవింద్ మంచి స్నేహితులు. వీరు శుక్రవారం మూడు బైక్‌లపై పెన్నానది వద్దకు వెళ్లారు. యుగేష్‌కు ఈత అంతంత మాత్రంగా వచ్చు. ముందుగా అతనే నీటిలోకి దిగాడు. ఉన్నట్లుండి మునిగిపోవడంతో సాయికిశోర్ అతన్ని కాపాడేందుకు నీటిలోకి దూకాడు. మిగిలిన వారు ఒడ్డున ఉన్నారు. అయితే యుగేష్‌తో పాటు సాయికిశోర్ కూడా నీటిలో మునిగిపోయాడు. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక రెస్క్యూటీమ్, గజ ఈతగాళ్లు పెన్నానది వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం యుగేష్ మృతదేహాన్ని, సాయంత్రం సాయికిశోర్ మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనతో ఇరు కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది.



యుగేష్ (ఫైల్)



సాయికిశోర్ (ఫైల్)

వివాహిత ఆత్మహత్య

సంగం : మండలంలోని మక్తాపురంలో ఓ వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరుకు చెందిన సురేఖ (27)కు మక్తాపురం గ్రామానికి చెందిన వెంకయ్యతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. సజావుగా ఉన్న వీరి కాపురంలో ఇటీవల మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వారు గొడవ పడ్డారు. అనంతరం భర్త ఇంటి బయట పడుకోగా భార్య ఇంట్లో పడుకుంది. శనివారం ఉదయం పొలానికి కొట్టే గడ్డి మందును భార్య తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న సురేఖను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 మంది ఈఓపీఆర్డీలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(పొగతోట) : జిల్లాలోని 26 మంది ఈఓపీఆర్డీలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి చర్యలు తీసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, జిల్లా అధికారుల ఆదేశాలు లెక్క చేయకపోవడం, టూర్ డైయిరీ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కలెక్టర్ ఎం. హరినారాయణన్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

నిమ్మధరలు



పెద్దవి	: రూ. 40
సన్నవి	: రూ. 25
పండ్లు	: రూ. 10

FORM NO.14 [See Regulation 33(2)]

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

Gr. & 1st floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

R.P. No. 18 of 2018 in O A No. 53 of 2016

Between:
Union Bank of India, AK Nagar Branch, Nellore-524004. ...Certificate Holder
Versus
M/s Sri Lakshmi Modern Rice Mill Rep. by its Proprietor
Sri Jakka Subba Rao and others. ...Certificate Debtors

DEMAND NOTICE

To
1) **M/s Sri Lakshmi Modern Rice Mill Rep. by its Proprietor Sri Jakka Subba Rao S/o Bhusaiah,** S.No.382/D/2, Block No.6, Ramnagar, Podalakur Village, Nellore - 524345. ...CD-1
2) **Sri Jakka Subba Rao, S/o Bhusaiah,** S.No. 382/D/2, Block No.6, Ramnagar, Podalakur Village, Nellore - 524345. ...CD-2
3) **Smt. Jakka Parameswari, W/o J. Subba Rao,** S.No. 382/D/2, Block No.6, Ramnagar, Podalakur Village, Nellore - 524345. ...CD-3

In view of the Recovery Certificate dt. 05-01-2018 issued in O.A. No.53 of 2016 passed by the Presiding Officer, DRT, Visakhapatnam an amount of **Rs. 5,99,29,010/- Rupees Five Crores Ninety Nine Lakhs Twenty Nine Thousand and Ten Only)** after deducting the amount of **Rs.17,52,000/-** as received by the applicant bank on 16-09-2016 (i.e. paid by auction purchaser on 16-09-2016) and accordingly the amount has to be recovered is due against you together along with future interest @ 11.25% per annum with monthly rests on the above said amount from 25-01-2016 till the date of payment / realization and also costs of the Original Application.

You are hereby called upon to deposit the above sum within 15 days of the receipt of the notice, failing which the recovery shall be made as per rules. In additions to the sum aforesaid you will be liable to pay:
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken for recovering the amount due.

(GIVEN UNDER MY HAND AND THE SEAL OF THIS TRIBUNAL AT VISAKHAPATNAM ON THIS DAY 08th Oct, 2018)

B.Nanda Kumar
RECOVERY OFFICER -II
Debt Recovery Tribunal, Visakhapatnam

నేడు నర్రవాడకు మాజీ ఉపరాష్ట్రపతి

దుత్తలూరు : జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారిని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆదివారం దర్శించుకోనున్నారు. ఆయన మొదటగా మండల కేంద్రమైన దుత్తలూరులో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం నర్రవాడ చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆయన రాక సందర్భంగా ఉదయగిరి సీఐ గిరిబాబు, దుత్తలూరు ఎస్సై ప్రభాకర్ నర్రవాడలో శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసుల నిఘా ఉంచారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 172
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 290
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 320
లేయర్ చికెన్	: 178